మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్, డిసెంబర్ 19 : మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి విద్యార్థీ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పనిచేసి క్షేత్రస్థాయిలో నిర్మూలించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు. ముస్తాబాద్ పోలీసులు మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులు, నాయకులు, యువతకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఒక్కరి భవిష్యతే కాకుండా ఆ కుటుంబం మొత్తం అంధకారంలోకి వెళ్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు, విద్యార్థులు, యువత సమన్వయంతో పనిచేస్తే మాదకద్రవ్యాలను పూర్తిగా కట్టడి చేస్తామని తెలిపారు. విద్యార్థినుల భద్రతకు మొదటి ప్రాధాన్యతనిస్తూ ప్రతి మండలంలో పోలీస్ అక్క పేరుతో మహిళా కానిస్టేబుల్‌ను ఎంపిక చేశామన్నారు. మహిళలు షీ టీమ్ నంబర్ 8712656425 లేదా పోలీస్ అక్కకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ఉంటూ జిల్లాలో మత్తు పదార్థాలను తరిమికొట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు. విద్యార్థులకు మహిళల రక్షణ, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ క్రైమ్స్, గంజాయి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐ గణేశ్, షీ టీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై హర్షం

మండలంలోని చీకోడు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామానికి చెందిన రమేశ్ రెడ్డి ముందుకు రావడంపై ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొండల్ రెడ్డి వారి బంధువు రమేశ్ రెడ్డిని గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని కోరడంతో ఆయన ముందుకు వచ్చి సీసీ కెమెరాలు వితరణ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా గ్రామస్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఎస్ఐ గణేశ్ నాయకులు బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలి

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, డిసెంబర్ 19 : మండల కేంద్రం నుంచి సిద్ధిపేట జిల్లా కేంద్రం వరకు గత ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు వరుసల రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం దాటినా ఇప్పటివరకు గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ఈ ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ వెంటనే స్పందించి ఈ డిసెంబర్ లోగా పనులను ప్రాంభించడానికి కృషి చేయాలన్నారు. లేకపోతే మండలంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో జనవరిలో ఇల్లంతకుంట మండల శివారు కిష్టాపూర్ నుంచి పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు కేతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడియాల సత్యనారాయణరెడ్డి, ముత్యంరెడ్డి, కోలాపురం కార్తీక్‌తోపాటు తదితరులున్నారు.

రాజన్న కోడెల మాయంపై విప్ ఆది మౌనం వీడాలి

- వెయ్యి కోట్ల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య

కోనరావుపేట, డిసెంబర్ 19: రాజన్న కోడెల మాయంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మౌనం వీడాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. రాజన్న కోడెలను అమ్ముకున్న అంశంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ వాటా ఉన్నట్లు స్పష్టమవుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌లో ఏడాది గడుస్తున్నా ఒక్క టీఎంసీ నీరు నింపలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు తెచ్చిన రూ.52కోట్ల నిధులకు సంబంధించిన జీవోను రద్దు చేసిన ఘనత ఆది శ్రీనివాస్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. వెయ్యికోట్లు తెచ్చామని చెప్పుకుంటున్న మీరు ఏయే పనులకు నిధులు కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రంగులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య

వేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ కారణంగా గత ప్రభుత్వంలో చేయాల్సిన కొన్ని పనులు నిలిచిపోయాయన్నారు. లక్ష్మీనరసింహారావు తన స్వగ్రామం మల్కపేటలో సొంత డబ్బులతో అనేక అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. అటువంటి నాయకుడిపై స్థానికుడు కాదంటూ చేస్తున్న విమర్శలు తీవ్ర ఆక్షేపణీయమన్నారు. కాంగ్రెస్ నేతలు చెబుతున్న వెయ్యి కోట్ల నిధులు మాటల్లో తప్ప క్షేత్రస్థాయిలో పనుల రూపంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పనికీ నిధులు ఇవ్వడం లేదన్నారు. ఆది శ్రీనివాస్ కోడెల అంశంపై స్పందించి వెంటనే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి ప్రజా నాయకుడు లక్ష్మీనరసింహారావుపై విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మంథని సంతోష్, గోపు పరశురాములు, యువజన విభాగం మండలాధ్యక్షుడు ముష్టం జీవన్‌గౌడ్, గంగసాని రమణారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సకల జనులకు మార్గదర్శి అంబేద్కర్

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్

కలెక్టరేట్, డిసెంబర్ 19 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నామస్మరణే ఈ దేశ ప్రజల రక్ష, సకల జనులకు మార్గదర్శి అంబేద్కర్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ అన్నారు. పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడిన తీరును సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మాట్లాడుతూ, కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడడం ఈ దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని వారన్నారు. తక్షణమే ప్రధానమంత్రి మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సురం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, రమేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా శిలాఫలకం నిర్మాణం

వీర్నపల్లి, డిసెంబర్ 19: మండలంలోని భూక్యతండా పరిధి రాశిగుట్టతండాలో ఇటీవల అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఓ యువకుడు ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీంతో పీఆర్ఏఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. గ్రామస్తుల సూచన మేరకు సదరు యువకుడు శిలాఫలకం గద్దెను మళ్లీ కట్టిస్తానని హామీ ఇచ్చాడు. గురువారం శిలాఫలకాన్ని యథావిధిగా ఏర్పాటు చేశారు.

నిరుద్యోగ యువతకు వెన్నుదన్నుగా ఉంటా

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

వేములవాడ/బోయినపల్లి, డిసెంబర్ 19: నిరుద్యోగ యువతకు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా ఉంటానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని దువ్వాస్ ఫంక్షన్ హాల్లో జరిగిన వేములవాడ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే నిరుద్యోగ యువతీ యువకులకు వెన్నుదన్నుగా నిలుస్తానని చెప్పారు. వేములవాడలో ఆధునిక గ్రంథాలయం, క్రీడా మైదానం వంటివి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అవకాశం కల్పిస్తే అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం ఉమా బాలచందర్, విద్యాసంస్థల కరస్పాండెంట్లు జితేందర్ రావు, గుండా శ్రీకాంత్, శ్యామ్ సుందర్,

వేములవాడ : మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

పరశురాములు తదితరులున్నారు. అలాగే, బోయినపల్లి మండలం తడగొండ, బోయినపల్లి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బోయినపల్లి ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిల్ల ఆనందం ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అనంతరం తడగొండ, బోయినపల్లి మీదుగా వేములవాడ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ తీశారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, డిసెంబర్ 19: జిల్లా నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన పలువురు మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున మాలమహానాడు జిల్లా నాయకులు రొడ్డ రామచంద్రం, ఎడ్ల రాజ్‌కుమార్, మండలాధ్యక్షుడు ఎడ్ల సందీప్‌ను ముందస్తు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఇల్లంతకుంటలో మాల మహానాడు నాయకులు మామిడి సంజీవ్, ఎలుక రామస్వామి, బట్టి చంద్రమౌళిని అరెస్ట్ చేసి మధ్యాహ్నం వదిలిపెట్టారు. చందుర్తిలో మాలమహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కమలాకర్, చందుర్తి మండల ఉపాధ్యక్షుడు ఆసి

ఎల్లారెడ్డిపేట : ఠాణాలో నాయకులు

నిపర్తి ఏసుకుమార్, తిమ్మాపూర్ గ్రామాధ్యక్షుడు స్వామిని ముందస్తుగా అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★My Son, THOUTU AKHIL S/o THOUTU KANAKAIAH, THOUTU MANGA (Mother), Age 16 Year, Student of Class 10th, shall henceforth be known as THOUTU AKHIL, S/o THOUTU LACHAIAH, THOUTU BHAGYA (Mother)
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

బ్యాంకులో వృద్ధుడి వద్ద నగదు చోరీ!

వేములవాడ, డిసెంబర్ 19: వేములవాడ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో వృద్ధుడి వద్ద నగదు కాజేసి తప్పించుకునే ప్రయత్నం చేయగా ఒకరిని బ్యాంకు సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లికి చెందిన వృద్ధుడు గుడిసె మాణిక్యం బ్యాంకులో 20వేల నగదును డ్రా చేశారు. ఇది గమనించిన పక్కనే ఉన్న సిరిసిల్ల పిసుక వెంకటేశ్ నీకు నోట్లు లెక్కించడం సరిగా రావడం లేదంటూ అతడి వద్ద నుంచి తీసుకొని లెక్కించి తిరిగి అప్పగించి అక్కడి నుంచి జారుకున్నాడు. మళ్లీ సదరు వృద్ధుడు నగదును లెక్కించుకోవడంతో రూ.2వేలు తక్కువ వచ్చాయి. దీంతో ఆ యువకుడే డబ్బులు కాజేశాడని వృద్ధుడు వెంటనే బ్యాంక్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. సదరు బ్యాంకు సిబ్బంది బాధితుడితో కలిసి వేములవాడ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సదరు అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రిమాండ్ తరలించినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

వాహనాల దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

వేములవాడ, డిసెంబర్ 19: ద్విచక్ర వాహనాలను దొంగలించిన కేసులో ఇద్దరికి వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ గురువారం తెలిపారు. వేములవాడ పట్టణానికి చిట్టిమల్ల అంజయ్య, జగిత్యాలకు చెందిన ఉబిది గంగస్వామికి చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని 2024 జూన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన (ప్రస్తుతం జగిత్యాలలో నివాసం) షైక్ మహబూబ్, బొప్పాపూర్‌కు చెందిన అనరసి కిష్టయ్య నిందితులను పట్టుకొని రిమాండ్ తరలించారని తెలిపారు. విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసును వాదించారన్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తులకు ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు రూ.రెండు వేలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

అతిగా మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 19: మద్యానికి బానిసైన భర్తను అతిగా తాగొద్దని మందలించినందుకు భర్త పది రోజుల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నారాయణపూర్ గ్రామానికి చెందిన దొమ్మాట నర్సయ్య(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం తాగుతూ ఇంటికి వస్తుండడంతో అతని భార్య పద్మ ఈనెల 10న తాగొద్దని మందలించింది. దీంతో నర్సయ్య ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నర్సయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

జనవరి 27న లక్ష డప్పులతో మహా ప్రదర్శన

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 19: మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు హైదరాబాద్‌లో జనవరి 27న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయకుడు రామంచ భరత్ తెలిపారు. గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణను స్వాగతిస్తున్న వారందరికీ లగ్గం డప్పు మోగిస్తామని, వ్యతిరేకిస్తున్న వర్గానికి చావు డప్పు మోగిస్తామని అన్నారు. ఇంజం వెంకటస్వామి మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ గజ్జెల అశోక్, ముక్కెర సంపత్‌కుమార్, థామస్, భిక్షపతి, దేవయ్య, సంజీవ్, తదితరులున్నారు.

వాలీబాల్ జట్టుకు ఎంపిక

వేములవాడ రూరల్, డిసెంబర్ 19 : వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు శాతవాహన విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శంకర్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 22వ కేరళ విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనే శాతవాహన యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదువుతున్న అఖిల్, మధు సూధన్ ఎంపికయ్యారన్నారు.

గ్రామస్తులకు టీబీ పరీక్షలు

గంభీరావుపేట, డిసెంబర్ 19: ముస్తాఫా నగర్‌లో లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులకు టీబీ పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో 112 మందికి టీబీ స్క్రీనింగ్, 91 మందికి ఎక్స్‌రేలు, 70 మంది టీబీ షాంపిల్స్ సేకరించామని వైద్యులు తెలిపారు. రెండు వారాలుగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం తదితర లక్షణాలున్నవారు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇక్కడ వైద్యులు అభినయ్, సీహెచ్‌వో రమేశ్, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలున్నారు.

పాఠశాలకు యువకుల విరాళం

వీర్నపల్లి, డిసెంబర్ 19: గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాకేశ్ గౌడ్ ఆధ్వర్యంలో యువకులు రూ.10 వేలు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అందజేశారు. గ్రామానికి చెందిన న్యాత కిషోర్ విద్యార్థులకు రూ.5 వేల విలువైన టై, బెల్టులు, గుర్తింపు కార్డులు అందజేయగా, అడవిపదిరకు చెందిన తిప్పవరపు భాస్కర్ రూ.5వేల విలువ చేసే మైక్ సెట్ అందజేశారు. ఇక్కడ నేతలు గజ్జల ప్రశాంత్, భూమయ్య, స్వామి, ఉపాధ్యాయులున్నారు.

ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలి

ముస్తాబాద్, డిసెంబర్ 19: ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు నాణ్యతతో కూడి ఉండాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష వంట నిర్వాహకులతోపాటు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఆవునూర్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ చార్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో శుభ్రతను తనిఖీ చేశారు. ఇక్కడ హెచ్ఎం లక్ష్మణ్, కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల నిరసన

చందుర్తి : ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

చందుర్తి/గంభీరావుపేట/ముస్తాబాద్, డిసెంబర్19: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. జిల్లా కమిటీ పిలుపుమేరకు రెండోరోజు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చందుర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఇక్కడ జిల్లా పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్యాల నరసయ్య తదితరులున్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్‌కు వినతి పత్రం సమర్పించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ముస్తాబాద్‌లో మండల పరిషత్ కార్యాలయం వరకు సపాయి కార్మికులు ర్యాలీగా వచ్చి ఎంపీడీవో బీరయ్యకు వినతి పత్రం అందించారు.

అమిత్ షాను కేంద్ర మంత్రిగా బర్తరఫ్ చేయాలి

వేములవాడ : పట్టణంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

వేములవాడ, డిసెంబర్ 19: రాజ్యసభలో అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని వేములవాడ డివిజన్ అంబేద్కర్ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జింక శ్రీధర్, మూలె కిషోర్, బత్తుల కమలాకర్, లింగంపల్లి కిరణ్, రాగుల రాంప్రసాద్, నీరేటి ప్రసాద్, సునీల్, శ్రీనివాస్, పిట్టల సతీశ్, అరుణ్, రాజు, ప్రసాద్ తదితరులున్నారు.

గంభీరావుపేట, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, సింగిల్ విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, నేతలు బాలయ్య, ఉపేందర్, శంకర్, బాలు, నరేశ్, బండ రమేశ్, సుదర్శన్ ఉన్నారు.

గంభీరావుపేట: కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

విద్యార్థుల కోసం బస్సుల సంఖ్య పెంచాలి

ఆర్టీసి డిపో మేనేజర్ ప్రకాశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్రనేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 19: విద్యా సంస్థల సమయానికి అనుగుణంగా విద్యార్థుల కోసం బస్సుల సంఖ్యను పెంచాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. గురువారం ఆర్టీసి డిపో మేనేజర్ ప్రకాశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు, ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఇక్కడ మట్టె శ్రీనివాస్, నవీన్, ముగ్దం అనిల్ గౌడ్, వినయ్, శ్రీకాంత్, శ్రీనివాస్, దేవరాజు పాల్గొన్నారు.

డిజిటల్ డ్రోన్ సర్వే

డిజిటల్ డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 19: అమృత్ 2.0 పథకంలో భాగంగా సిరిసిల్ల మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్‌కు ఎంపికైంది. ఈ మేరకు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది సిరిసిల్ల పట్టణంతోపాటు విలీన గ్రామ పంచాయతీల్లో గుర్తించిన లొకేషన్ పాయింట్ల నుంచి డిజిటల్ డ్రోన్ సర్వే చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సర్వే ఆఫ్ ఇండియా సిబ్బందితో మాట్లాడి సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, దార్నం అరుణ, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సార్, మున్సిపల్ అధికారులు, తదితరులున్నారు.

గీత కార్మికుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గీత కార్మిక సంఘం నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి, డిసెంబర్ 19: బోయినపల్లి మండలం తడగొండకు చెందిన మండల గీత కార్మిక సంఘం నాయకుడు కాసారపు శ్రీధర్‌గౌడ్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె ర